క్లుప్తంగా

నేటి నుంచి నవగ్రహ ప్రతిష్ఠ పూజలు

కొత్తూరు: కొత్తూరు పట్టణంలోని హనుమాన్ ఆలయంలో నేటి నుంచి (సోమవారం) నవగ్రహాల ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు నాగరాజుశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఆలయంలో హోమ, యజ్ఞాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానికులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

నేటి నుంచి బ్రూసెల్లా వ్యాధి నివారణ టీకాలు

షాబాద్: నేటి నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో బ్రూ సెల్లా వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని షాబాద్, రేగడిదోస్వాడ పశు వైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న షాబాద్, కుమ్మరిగూడ, కక్కులూరు, 31న బోనగిరిపల్లి, నాగర్‌కుంట, కక్కులూర్, ఫిబ్రవరి 1న మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ, అంతారం, కేసారం, 2న దామర్లపల్లి, నాన్‌ంధార్‌ఖాన్‌పేట్, మన్‌మర్రి, బోడంపహాడ్, 3న సాయిరెడ్డిగూడ, లింగారెడ్డిగూడ, అప్పారెడ్డిగూడ, 4న కేశవగూడ, ఎల్గోండగూడ, ముద్దెంగూడ, మల్లారెడ్డిగూడ గ్రామాల్లో పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు పశువైద్య సిబ్బందికి సహకరించి 4 నుంచి 8 నెలల లోపు లేగలు, దూడలకు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయినికి జాతీయ పురస్కారం



కీర్తికి పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పీర్జాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న కీర్తికి షాద్‌నగర్ పట్టణానికి చెందిన నటరాజ కళానిలయం సంగీతం నృత్య శిక్షణ సంస్థ వారు జాతీయ పురస్కారం అందజేశారు. కీర్తి కళారంగంలో అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం అందించినట్లు సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ.. కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నహీద్‌కు గోల్డ్ మెడల్



పతకం అందుకుంటున్న నహీద్

కొందుర్గు: హైదరాబాద్ జీడిమెట్లలోని ఎంజే గార్డెన్‌లో చరణ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో కొందుర్గు న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ విద్యార్థిని ఎండీ నహీద్ గోల్డ్ మెడల్ సాధించారు. అండర్ 12 కటాస్ విభాగంలో నహీద్ ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించినట్లు మాస్టర్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. కిన్నెర రవి హజీ మాస్టర్ చేతుల మీదుగా నహీద్ మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న గుర్రంపల్లి జాతర

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలకు ఎంపీపీ యాదమ్మ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన కందూర్లకు గుర్రంపల్లి, రావిర్యాల, ఇంద్రానగర్, చౌదరిగూడ, ఎదిర తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య

షాద్‌నగర్: కాంగ్రెస్‌పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. ఆదివారం షాద్‌నగర్ మున్సిపాలిటీలోని రెండవ వార్డులో కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. కార్యకర్తలు పార్టీకి పట్టుగొమ్మలన్నారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని తెలిపారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో నాయకులు పార్టీ బలోపేతం కోసం శ్రమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని సూచించారు. ఈ సందర్భంగా వార్డు కమిటీ అధ్యక్షుడిగా అనిల్, ఉపాధ్యక్షుడిగా మైసయ్య, కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తారాసింగ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మసూద్ అలీఖాన్, శంకరయ్య, సయ్యద్ ఖదీర్, రమేష్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, నరేష్, మాసయ్య, చింటు, శంకరయ్య, చంద్రకళ పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు ఎవరికో..?

- అజీజ్‌నగర్‌లో 40, సురంగల్‌లో 20 ఇళ్లు
- అజీజ్‌నగర్‌లో 872, సురంగల్‌లో 150 దరఖాస్తులు
- త్వరలో లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసిన అధికారులు



అజీజ్‌నగర్ సమీపంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

మొయినాబాద్‌రూరల్: సొంతింటి కల ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన అర్హులైన పేదలకు త్వరలో లక్కీ డ్రా ద్వారా ఇళ్లను పంపిణీ చేయనున్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్లకు అప్పట్లో శ్రీకారం చుట్టారు. సొంతగూడు లేని నిరుపేదలు ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూసినా ఆ సమయం రానే వచ్చింది. మండల కేంద్రమైన మొయినాబాద్ పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీలో 40 ఇళ్లు, సురంగల్ గ్రామ పంచాయతీలో 20 ఇళ్ల నిర్మాణం చివరి దశకు చేరుకొంది. ఈ ఇళ్లను అర్హులకు అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మండల రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు పూర్తి చేశారు. మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల పోలీస్ అకాడమీ సమీపంలో ఉన్న అజీజ్‌నగర్ రెవెన్యూ హైదరాబాద్–బీజాపూర్ రహదారి పక్కనే 40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించారు. ఇవి పూర్తి దశకు చేరుతుండడంతో మహిళల పేరుతోనే ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. గతంలో మీసేవ ద్వారా స్వీకరించిన వాటితో పాటు తిరిగి గ్రామంలో డప్పు వేయించి దరఖాస్తులను స్వీకరించారు. దీంతో అజీజ్‌నగర్ గ్రామంలో నిర్మించిన 40 ఇళ్లకు గాను 872 దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా సురంగల్ సమీపంలో నిర్మించిన 20 ఇళ్లకు సంబంధించి 150 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

లక్కీ డ్రా ద్వారా ఇళ్ల పంపిణీ

డబుల్ ఇళ్ల కోసం దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు అర్హులను ఎంపిక చేసేందుకు పైఅధికారులకు పంపించారు. లబ్ధిదారుల పేర్లను చీట్టిలు వేసి బహిరంగంగా లక్కీడ్రా తీసి తుది జాబితాను ప్రకటించనున్నారు.

దరఖాస్తుల పూర్తిస్థాయి పరిశీలన

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు, తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో పరిశీలన చేశారు. అజీజ్‌నగర్‌లో 40 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు గాను 872 దరఖాస్తులు రాగా, వీటిలో పూర్తిస్థాయిలో అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేసి 94 మంది డబుల్ ఇళ్లకు అర్హులుగా ప్రకటించారు. అలాగే, సురంగల్‌లో 20 ఇళ్లకు గాను 150 దరఖాస్తులు రాగా 28 మంది అర్హులుగా గుర్తించారు.

పేదల కల నెరవేరబోతోంది



పేదల సొంతింటి కల త్వరలో నెరవేరబోతుంది. ఈ ఇళ్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అధికారులకు దరఖాస్తులు స్వీకరించి, పరిశీలన పూర్తి చేశారు. ఇది పేదల అదృష్టం వీలైనంత త్వరగా ఇళ్లను పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నాం.

– నక్షత్రంజీవంతు, ఎంపీపీ, మొయినాబాద్

త్వరలో అందనున్న ఇళ్లు



అర్హులైన పేదలకు త్వరలో ఇళ్ల పంపిణీ జరగనుంది. అజీజ్‌నగర్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను త్వరగా ప్రకటిస్తే ఎంతో సంతోషంగా ఉంటుంది. అనర్హులకు అవకాశం ఇవ్వకుండా, నిజమైన పేదలను గుర్తించి వారికి ఇళ్లు కేటాయించాలి.

– కాలె శ్రీకాంత్, జెడ్పీటీసీ, మొయినాబాద్

అర్హులకు అవకాశం...



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకొని అర్హులైన వారి ఎంపిక పరిశీలన పూర్తైంది. జిల్లా అధికారుల సూచనల మేరకు లక్కీ డ్రా పైఅధికారులు తేదీని ఎప్పుడు ప్రకటిస్తే అప్పుడు లక్కీ డ్రా తీయడం జరుగుతుంది. దాదాపు 20 రోజుల పాటు దరఖాస్తుల పరిశీలన కొనసాగింది.

– అశోక్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ నేత శ్రీవర్ధన్‌రెడ్డి

కేశంపేట: ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలోని శక్తి కేంద్రంలో బూత్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ సబ్బండ వర్గాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చిన బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, ఆనంద్‌కుమార్, అంజయ్య, రఘురాం గౌడ్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- సంక్షేమ పథకాలకు అకర్షితులై పార్టీలో చేరికలు
- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: రాష్ట్రంలో సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలకు ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన పలువురు వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుందన్నారు. అభివృద్ధి చేస్తున్న పార్టీని ఆశీర్వాదించాలని ఆయన కోరారు. పార్టీలో చేరిన వారిలో గ్రామ ఉప సర్పంచ్ అబ్బి సుందరయ్య, వార్డు సభ్యుడు జంగయ్యతో పాటు గ్రామస్తులు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, పాపిరెడ్డిగూడ గ్రామ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నర్సింలు, శంకర్, ప్రభాకర్, బాలరాజ్ పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి

బీఎస్పీ నాయకుడు శ్రీనివాస్



సంతకాలను సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: బీసీలు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తారని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ, కాంగ్రెస్ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకొని తీరని అన్యాయం చేశాయని మండిపడ్డారు. మన ఓటు మనకే అన్న నినాదంతో బీసీలందరు ఏకమై ముందుకు సాగాలని అన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక తదితర రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కోటి సంతకాలతో కోటి గొంతుకలను ఏకం చేసే విధంగా బీఎస్పీ బీసీల పక్షాన ధర్మపోరాటం చేస్తుందని చెప్పారు. జనాభా ధామాషా ప్రకారం బీసీలకు అందాల్సిన ఫలాలను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు తుప్పరికుమార్, సెక్టార్ అధ్యక్షుడు శివకుమార్, బూత్ కమిటీ అధ్యక్షుడు శంకర్, నాయకులు యాదగిరి, యాదయ్య, మహేష్, చందు పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో స్నేహభావం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి, తదితరులు

షాబాద్: గ్రామీణ క్రీడాకారులకు ఆటల పోటీలు ఎంతో దోహదపడతాయని, స్నేహభావం పెంపొందుతుందని బోడంపహాడ్ గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామంలో సహారా డిజిటల్ టోర్నమెంట్‌ను ఉమర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సరళ రాంచంద్రారెడ్డిలతో కలిసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజం అన్నారు. క్రీడలను నిజ జీవితంతో భాగం చేసుకుంటే శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయాలు వరిస్తాయన్నారు. ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదిరెడ్డి, ఎండీ ఇనాయత్, మాజీ సర్పంచ్ నర్సింహులు, భీమయ్య తదితరులున్నారు.

పాతికేళ్లకు కలసి.. జ్ఞాపకాల ఒడిలో తడిసి



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాద్‌నగర్: పాతికేళ్ల తర్వాత బాల్యమిత్రులందరు ఒకే వేదికపై కలుసుకోవడం చెప్పలేని మధురానుభవం.. ఆదివారం పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులోని నక్షత్ర ఫంక్షన్ హాల్‌లో పద్మావతి కాలనీలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97 బ్యాచ్ పదవ తరగతి పూర్వపు విద్యార్థుల రజతోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 70 మంది పూర్వపు విద్యార్థులు హాజరై తమ జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పాఠశాలల్లో చదివే రోజుల్లో చేసిన అల్లరి పనులను గుర్తుచేసుకుంటూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఉపాధ్యాయులు వెంకటరాఘవన్, గంగిరెడ్డి, బీపీ నర్సింహ్మారెడ్డి, శ్యామల, శివకుమారి, శారదలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వారికి మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవం పొందినప్పుడే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థులందరు వారి వారి ఉన్నతిని తెలుపుతుంటే ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. గురువులు సూచించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం వివిధ రంగాల్లో కొనసాగుతూ ఆనందమైన జీవితాన్ని గడుపుతున్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు. ఉపాధ్యాయిని శ్యామల రాసిన కవితను విద్యార్థులకు అంకితం చేశారు.

గంపల బోనాలు.. మల్లన్న బ్రహ్మోత్సవాలు



అజీజ్‌నగర్‌లో మల్లికార్జున స్వామికి గంపలో బోనం తీసుకువెళ్తున్న భక్తులు



శంకర్‌పల్లి: కొండకల్ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: మల్లన్న బ్రహ్మోత్సవాలకు బోనాల నైవేద్యాన్ని గంపలో తీసుకువెళ్లడం అజీజ్‌నగర్ గ్రామంలో ఆనవాయితీ. శివసత్తుల పూనకాలు, డోలు వాయి ద్యా లు, పోతురాజుల విన్యాసాలతో మహిళలు స్వామివారికి తమ ఇళ్లల్లో నుంచి గంపల్లో నైవేద్యాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ శ్రీ బ్రహ్మారాంబిక, మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. మొదటి రోజు భక్తులు తమ దేవతగా కొ లుస్తూ ఇళ్లల్లోంచి గంపలను ఏర్పాటు చేసుకొని నై వేద్య బోనాలను ఎత్తుకొని ఊరేగింపు నిర్వహించారు.

కనుల పండువగా కల్యాణోత్సవం..

అజీజ్‌నగర్ శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మారాంబిక కల్యాణోత్సవం ఒగ్గు రాజులు కన్నుల పండుగగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని హిమాయత్ సాగర్ నీటి ఒడ్డున గల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ఎదుట స్వామివారు, అమ్మవారి దేవత మూర్తుల విగ్రహాలు ఏర్పాటు చేసి పట్టువస్త్రాలను యాదవ కమిటీ సభ్యులు సమర్పించారు. దీంతో శ్రీ బ్రహ్మారాంబిక, మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం, బోనాల ఊరేగింపు అందరిని ఆకట్టుకుంది. మూడు రోజులు పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు, సినీ తారలు, హీరోలు పాల్గొనున్నట్లు యాదవ కమిటీ సభ్యులు తెలిపారు. వి విధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు మల్లన్న స్వామి దర్శనం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉత్సవాలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

శంకర్‌పల్లి: జాతర ఉత్సవాలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ గ్రామంలో నిర్వహించిన మల్లిఖార్జున కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో జాతర ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరాలకు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య , ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, బీజేపీ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాములుగౌడ్, సీనియర్ నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, కంజర్ల ప్రకాష్, ప్రభాకర్‌రెడ్డి, రాంరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న జంగయ్య

కొందుర్గు: డబుల్ ఇళ్ల విషయమై సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం కొందుర్గు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కొందుర్గు ఏనేగడ్డపై గతంలో ప్రభుత్వం 74 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఈ ప్లాట్లను లబ్ధిదారులకు కొలతలు చేసి ఇవ్వాలని పలుమార్లు అధికారులను కోరిన పట్టించుకోవడం లేదని ఆయన వాపోయారు. ఈ విషయమై తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నామన్నారు. పేదలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు బందెమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

బోనమెత్తిన పల్లె



శివసత్తులు, పోతురాజుల విన్యాసాలు

షాబాద్: ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని మండల పరిధిలోని వెంకమ్మగూడ గ్రామంలో ఆదివారం మల్లన్న బోనాలు, కల్యాణోత్సవాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు దేవాలయం వద్ద బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, గ్రామ సర్పంచ్ శకుంతల, ఎంపీటీసీ గుత్తి సునితా రామస్వామి, మాజీ ఎంపీటీసీ మద్దూరు పాండు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులున్నారు.

దళితుల సంక్షేమమే ధ్యేయమంటూ పబ్బం

బీజేపీ నాయకుడు పాండురంగారెడ్డి



సమావేశంలో పాల్గొన్న పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు, కమిటీ సభ్యులు

చేవెళ్ల: రాష్ట్రంలో దళితుల అభివృద్ధే లక్ష్యమని మాయ మాటలతో ఈ ప్రభుత్వం పబ్బం గడుపుతుందని బీజేపీ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పాండురంగారెడ్డి, అత్తెల్లి అనంత్‌రెడ్డిలు అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం బీజేపీ దళిత మోర్చా మండల కార్యవర్గ సమావేశంలో దళితమోర్చా మండల అధ్యక్షుడు ఎ.అశోక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో సీఎం కేసీఆర్ మాటలు కోటలు దాటుతున్నాయి కానీ, అడుగులు గడప దాటడం లేదనే చందనా పాలన సాగుతుందన్నారు. రెండు సార్లు అధికారంలోకి వచ్చినా ఈ పార్టీ దళితుల పేరు చెప్పుకుంటూ ముందుకు వెళ్తున్నారే కాని చేసింది ఏమిలేదన్నారు. దళితులకు భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు,, దళిత బంధు ప్రతి కుటుంబానికి ఇస్తామని చెప్పిన ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదన్నారు. దళితులకు చేసింది ఏమిలేదని దళిత కుటుంబాలు కేసీఆర్ మాయ మాటలు నమ్మిమోసపోవద్దని సూచించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేవెళ్ల బీజేవైఎం టౌన్ అధ్యక్షుడు బండారి శేఖర్‌రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బీజేవైఎం జాయింట్ సెక్రటరీ బాల్‌రెడ్డి, దళిత మోర్చా మండల కమిటీ సభ్యులు రవీందర్, కుమార్, వెంకటేష్, సాయి, రమేష్, అనిల్, నవీన్, రామక్రిష్ణ, మల్లేశ్, ప్రభాకర్ ఉన్నారు.

జీవహింసను విడనాడాలి

ఆశ్రమ కార్యదర్శి శివయ్యస్వామి



భక్తులతో మాట్లాడుతున్న శివయ్యస్వామి

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరు జీవ హింసను విడనాడాలని యానగొంది మాణికేశ్వరి మాత ఆశ్రమం కార్యదర్శి శివయ్యస్వామి అన్నారు. కొత్తపల్లి గ్రామంలోని మాణికేశ్వరి మాతా ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హింసను వీడి ప్రేమను పెంచాలని తెలిపారు. దుఃఖానికి కారణం కోరికలని, కోరికలను అణిచివేయాలన్నారు. నిత్యం దైవ చింతనతో భగవంతుడిని స్మరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి హరిశంకర్, గౌరవ అధ్యక్షుడు లింగారెడ్డి, అర్చకులు లింగం, అంజనేయులు, కోశాధికారి విశ్వంచారి, సలహాదారులు మాణిక్యం, గౌరవ అధ్యక్షుడు దారం నర్సింలు, దారం ప్రభు, గ్రామ సర్పంచ్ శాంతచెన్నయ్య, ఎంపీటీసీ శోభాసుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీకాంత్

మొయినాబాద్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్ అన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో గ్రామానికి చెందిన బేగరి బాబయ్య, యాదయ్యల జ్ఞాపకార్థం తెలంగాణ ఆగ్రో రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో శ్రీనివాస్ అండ్ సన్స్ ఆదివారం సురంగల్ ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎస్) క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. కాలె శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా విచ్చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం వల్ల క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. క్రీడలతో ప్రాంతాల మధ్య మంచి సంబంధాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంఏ రవూఫ్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, నిర్వాహకులు వినోద్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.